సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 22 । ఆగస్టు । 2024



సీక్రెట్‌గా సర్వీస్ లిస్టు

వైద్యారోగ్య శాఖలో నియామకాల నిప్పు రాజుకుంటోంది. సర్వీస్ సీనియారిటీపైనా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. - 8లో



ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

ఓ ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు. టీడీపీ వేధింపుల వల్లే అని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. - 8లో

అరసవల్లిలో 'విచారణ' వాయిదా

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన దినసరి వేతనదారుల నియామకాలపై చేపట్టాల్సిన ప్రత్యేక విచారణ ప్రస్తుతానికి వాయిదా పడినట్లు తెలిసింది. వాస్తవానికి బుధవారం విచారణాధికారి ఆర్జేసి సుబ్బారావు ఆధ్వర్యంలో విచారణ జరగాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలతో వాయిదా పడినట్లుగా ఆలయ వర్గాలు ప్రకటించాయి.

న్యూస్‌రీల్

నేడు మాకన్నపల్లిలో జానపద వేడుకలు

పలాస: పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం 6గంటల నుంచి ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా జానపద వేడుకలు జరగనున్నాయని సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ప్రచార కార్యదర్శి కుత్తుం వినోద్ ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా విజయనగరం జిల్లాకు చెందిన పాటల తూటా ఎ.ఉదయ్‌భాస్కర్ వస్తున్నారన్నారు. అలాగే యువశక్తి యువజన సంఘం మాకన్నపల్లి కళాబృందాలు, బొడ్డపాడు జెస్సీ ఈవెంట్స్, కుమారి సుధీష్ణ సాంస్కృతిక నృత్యాలు, ఉద్దానం కళాకారులతో జానపద గేయాలు ఉంటాయన్నారు. అలాగే వ్యాస రచన పోటీ విజేతలకు బహుమతులు, ప్రత్యేక కళాకారులకు సన్మానాలు ఉంటాయని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వినోద్ కోరారు.

పాతపట్నం పీసీపై తాత్కాలిక సస్పెన్షన్ వేటు

శ్రీకాకుళం క్రైమ్ : పోలీసులే అవినీతికి పాల్పడితే సహించేది లేదని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. పాతపట్నం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న పి.శ్యామలరావు అనే పోలీస్ కానిస్టేబుల్ రూ. 5 వేలు లంచం తీసుకుని అవినీతికి పాల్పడినందుకు శాఖాపరమైన క్రమశిక్షణ చర్యల్లో భాగంగా విధుల నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. ఇటీవల ఒడిశా నుంచి మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి నుంచి రూ. 5 వేలు లంచం తీసుకుని వదిలేశాడు. ఈ విషయం ఎస్పీ దృష్టికి రాగా విచారణ చేయించారు. విచారణలో నిజనిర్ధారణ కావడంతో ఎస్పీ వెంటనే చర్యలు తీసుకున్నారు. పోలీసు అధికారులు గానీ, సిబ్బంది గానీ ఇలాంటి చర్యలకు పాల్పడితే పబ్లిక్ నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, తప్పకుండా విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాశీబుగ్గలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



శ్రీకాకుళం క్రైమ్: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి కొత్త కొత్త విధానాలు అమలు చేస్తున్నారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం కాశీబుగ్గ పీఎస్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. కాశీబుగ్గ చుట్టు పక్కల పరిసర ప్రాంతాలతో పాటు టెక్కలి, మందస, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మెళియాపుట్టి, నందిగాం మండలాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎస్పీ ప్రారంభిస్తున్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి శుక్రవారం ఉదయం 11:30గంటల నుంచి కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ స్వయంగా ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు.

గ్రామసభల్లో ప్రజలంతా పాల్గొనాలి



వీసీలో పాల్గొన్న అధికారులు

శ్రీకాకుళ పాతబస్టాండ్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 23న జరగనున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఈ సభల్లో ప్రజలంతా పాల్గొనేలా చూడాలని, ఉపాధి హామీ పథకం కింద ప్రతిపాదించిన పనులపై విస్తృతంగా ఈ గ్రామ సభల్లో చర్చించాలని నోడల్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గ్రామసభల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని అనంతరం నోడల్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకేరోజున గ్రామసభలను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామ సభకు ఒక ప్రత్యేకాధికారిని నియమించాలని సూచించారు.

సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సెప్టెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. జిల్లా కోర్టు హాల్‌లో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలోని కక్షిదారులకు ఇదో సువర్ణావకాశమని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కేసులు ఇప్పుడు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్ కేసులు, బ్యాంకు సంబంధించిన కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు.



ఈ బ్లాక్‌స్పాట్ బాధ్యులెవరు..?

చిత్రం చెప్పిన కథ

ఎచ్చెర్ల క్యాంపస్/శ్రీకాకుళం క్రైమ్:


పై చిత్రాన్ని పరిశీలనగా చూడండి.. రోడ్డు మీద ఏదో ఒలిగివుంది.. దానిపై నుంచి వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. అంతే కదా మీకు కనిపించింది. ఒలిగింది ఇసుక.. ఎక్కడో తెలుసా.. జిల్లాలోనే అత్యధిక రోడ్డు ప్రమాదాలు సంభవించే శ్రీకాకుళం బైపాస్ క్రాస్ దగ్గర. అసలే బ్లాక్‌స్పాట్.. ఆపై నలువైపుల నుంచి జోరుగా రాకపోకలు సాగించే వాహనాలు.

ఆ మార్గంలో ప్రయాణిస్తూ జారిపడితే అంతే సంగతులు. సమస్య చూసేందుకు చిన్నదే. కానీ జరగరానిది జరిగితే ప్రాణాలను పరిహారంగా సమర్పించాలి.



మరి దీన్ని తొలగించాల్సిన బాధ్యత ఎవరిది..? నడిరోడ్డుపై జారవిడిచిన వాహనానిదా..? నాలుగురోజులు గడుస్తున్నా.. తొలగించేందుకు చర్యలు చేపట్టని అధికారులదా..? ప్రమాదం జరిగినప్పుడు కదా... అని చోద్యం చూసే పోలీసులదా.. మనకెందుకులే అని ఫిర్యాదు చేయకుండా వదిలేసిన స్థానికులదా..? **ఒకరిద్దరి నిర్లక్ష్యం.. నిండు ప్రాణాలను బలికోరేదాకా ఇలాగే వదిలేద్దామా..!**

బ్లాక్ స్పాట్ అంటే..



మూడేళ్ల కాలపరిమితిలో ఐదుసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగినా లేదా ఒకే స్పాట్‌లో (ప్రమాదం) పదిమంది వరకు చనిపోయినా ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా పరిగణిస్తారు. ఇలాంటి బ్లాక్ స్పాట్‌లు జిల్లాలో 57 ఉన్నాయి. ఇసుక ఒలిగిన ప్రాంతం బ్లాక్ స్పాట్.

ప్రాణాలు పోతున్నాయ్..



ఇలాంటి చిన్న చిన్న తప్పిదాల వలన ఇటీవల కాలంలో ఈ బ్లాక్‌స్పాట్ పరిసరాల్లో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. నాలుగు కుటుంబాలను చీకట్లోకి నెట్టేశారు.

ఏదీ ప్రమాదాల నివారణ.. నిరంతర నిఘా..



ప్రమాదాలకు ఆస్కారమైన.. వాహనాల రాకపోకలు అధికంగా సాగే జాతీయ రహదారిపై నిరంతరం సేవలందించే హైవే పెట్రోల్ సిబ్బంది దృష్టి కూడా ఈ ప్రాంతంపై పడలేదు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు మూడు షిఫ్టుల్లో విధుల్లో ఉంటూ ప్రమాదాల కట్టడికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని చెప్పే వీరెవరి కంటినీ ఈ ఇసుక రేణువు తాకలేదు.

చట్టం ఏం చెబుతోంది..



హైవే రోడ్లపై ఇసుక, కంకర, ఊక, ఆయిల్ మరే ఇతర లోడులైనా కింద పడిపోయినప్పుడు వాటిని తక్షణమే క్లియర్ చేయాల్సిన బాధ్యత కన్సస్‌నర్లది (రోడ్డు కాంట్రాక్టర్లది). ఒకవేళ వాహనాలు బ్రేక్ డౌన్ అయ్యి ఆగినా, ప్రమాదాలకు గురై ఎక్కువ సేపు నిలిచినా చుట్టూరా రేడియం స్టిక్కర్లు అంటించాలి. ఆ ప్రదేశంలో సూచీ బారికేడ్లు పెట్టాలి. కన్సస్‌నర్లు బాధ్యత విస్మరిస్తే ఇలాంటి ఒకట్రెండు నిర్లక్ష్యాలను చూసి ఎన్‌హెచ్‌ఐ వారు రెండు నోటీసులు జారీ చేస్తారు. అప్పటికీ మించితే వారిని తొలగిస్తారు.

కూన.. నీకిది తగునా !

కూనకు ఏం జరిగింది..?



మంత్రి పదవి విషయంలో కూన రవికుమార్‌కు అన్యాయం జరిగిందని పార్టీలకు అతీతంగా చాలా మంది మద్దతు పలికారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా సొంత సామాజిక వర్గం మొత్తం అండగా నిలిచింది. కింజరాపు ఫ్యామిలీ రాజకీయ ఎత్తుగడలకు కూన రవికుమార్ నష్టపోయారని పెద్ద ఎత్తున సానుభూతి లభించింది. ఇంత జరిగాక కూన ఏం చేయాలి..? తనకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదని అనుకోవాలి.

మరి కూన ఏం చేశారు..?

మంత్రి పదవి విషయంలో అన్ని వర్గాల వారు కూనకు మద్దతుగా నిలిస్తే.. ఆయన మాత్రం కొందరి ఉద్యోగాలు తీసేసే పనిలో పడ్డారు. ఎచ్చెర్ల అంబేడ్కర్ యూనివర్సిటీలో గతంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, డైలీ వేజ్ కింద జరిగిన నియామకాలన్నీ రద్దు చేయాలని వర్సిటీ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. తన రాజకీయ భవిష్యత్‌కు గండి కొట్టారని కింజరాపు ఫ్యామిలీపై ఎంత ఆవేదనతో కూన రవికుమార్ ఉన్నారో.. అదే స్థాయిలో తమ ఉపాధిని తీసేస్తున్న కూన రవికుమార్‌పై వర్సిటీ ఉద్యోగులు ఆవేదనతో ఉన్నారు.

చంద్రబాబు ఏం చెప్పారు..? ఏం చేస్తున్నారు?



'ముందు జరిగిన నియామకాలను రద్దు చేయం. వలంటీర్లను సైతం కొనసాగిస్తాం. వారికి నెలకి రూ.10వేల జీతం ఇస్తాం. ఏ ఒక్కరికీ అన్యాయం చేయం. ఎన్నికల్లో గెలిపించండి. అంతకుమించి భవిష్యత్ ఇస్తాం' అని ఎన్నికల సభల్లో చంద్రబాబు అండ్‌కో తెగ ప్రచారం చేసింది. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల భవిష్యత్‌కు గ్యారంటీ అని చెప్పుకొచ్చారు. సంపదను సృష్టించినట్టు కొత్తగా 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రజల్ని నమ్మించి ఓట్లు వేయించుకున్నారు. కానీ అధికారంలోకి వచ్చాక కోతలపైనే దృష్టి పెట్టారు.

- అంబేడ్కర్ యూనివర్సిటీలో ఎమ్మెల్యే కూన రవి జోక్యం
- గతంలో నియమితులైన ఉద్యోగులను తొలగించాలని ఒత్తిడి
- కూన ఒత్తిడితో విచారణకు ఆదేశించిన వర్సిటీ అధికారులు
- పాపం మూటగట్టుకోలేమని విచారణ బాధ్యతలు తీసుకోవడానికి ఇష్టపడని సభ్యులు
- సరస్వతీ నిలయంలో పెరుగుతున్న రాజకీయ జోక్యంపై మేధావుల విస్మయం



వర్సిటీపై రాజకీయాలేంటి?

కూటమి ప్రభుత్వం వచ్చాక రాజకీయ జోక్యం పెరగటం, చివరికి రాజకీయాలకు దూరంగా ఉండే విశ్వవిద్యాలయాల్లో సైతం తల దూర్చడం వంటి పరిణామాలు విమర్శలకు తావిస్తోంది. మంత్రి పదవి ఇవ్వకపోవడంపై జాలి చూపించిన సొంత సామాజిక వర్గాల వారిపైనే కూన రవికుమార్ కక్ష కట్టడం చర్చనీయాంశంగా మారింది. జరుగుతున్న రాజకీయ పరిణామాలను పరిశీలిస్తున్న ప్రతి ఒక్కరూ తప్పు పట్టుబడుతున్నారు. వర్సిటీ మాజీ అధికారులు సైతం విస్తుపోతున్నారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

తమకు జరిగితే అన్యాయం.. వేరొకరికి అదే తీరులో వ్యవహరిస్తే న్యాయం అనే దారిలో కూటమి నేతలు ముఖ్యంగా టీడీపీ ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక చిరుద్యోగులను తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నారు. అందులో భాగంగా బీఆర్‌ఏయూలో గతంలో నియమించిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, డైలీ వేజ్ ఉద్యోగులను తొలగించాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పెద్ద ఎత్తున ఒత్తిళ్లు తెస్తున్నారు. అధికారులను తమ క్యాంప్ ఆఫీసుకు రప్పించుకొని, తొలగించాల్సిన వారిపై వినతి పత్రం ఇచ్చి, అందుకు తగ్గట్టుగా హెచ్చరికలు జారీ చేశారు.

ఒత్తిళ్లకు తలొగ్గి..

కూన రవికుమార్ ఒత్తిళ్లను భరించలేకనో, తలొగ్గో తెలియదు గానీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 2019 నుంచి 2024వరకు జరిగిన నియామకాలపై విచారణ నిర్వహించి, నివేదిక ఇవ్వాలని వీసీ రజిని ఈ నెల 19న ఏకంగా నోట్ ఆర్డర్ జారీ చేశారు. ఈ మేరకు 19వ తేదీన రిజిస్ట్రార్ సుజాత ఉత్తర్వులు కూడా జారీ చేశారు. త్రిసభ్య విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో రెక్టార్ బిడ్డిక అడ్డయ్య, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉదయ్ భాస్కర్, బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కొర్ల స్వప్నవాహినిలను సభ్యులుగా నియమించారు. ఈ నెల 24వ తేదీలోపు గతంలో జరిగిన నియామకాలపై నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. గతంలో నియమించిన ఉద్యోగాలు తొలగించాలంటూ ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇచ్చిన వినతి పత్రం ఆధారంగా కమిటీ వేసిన అధికారుల తీరు విమర్శలకు దారి తీసింది. ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, ఉన్నత విద్యా మండలి దృష్టికి సైతం ఈ సమస్య తీసుకువెళ్లకుండా ఏకపక్షంగా కమిటీ వేయటం ప్రస్తుతం వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

జరిగిన నియామకాలివే..



- గవర్నర్ పరిధిలో ఉండే విశ్వవిద్యాలయాల్లో ప్రతీది పారదర్శకంగానే జరిగాయన్నది అందరికీ తెలిసిందే.
- కాంట్రాక్ట్ పద్ధతిలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, ఇద్దరు ఎగ్జెంట్ ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, ఇద్దరు లా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు, బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ టూ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్‌తో పాటు మరో 22 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, టీచింగ్ అసోసియేట్‌లను నియమించారు.
- ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 34 మంది జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేటర్లను నియమించారు.
- డైలీ వేజ్ కింద ముగ్గురు డ్రైవర్లు, ఇద్దరు పారిశుధ్య కార్మికులను నియమించారు.
- ఈ నియామకాలన్నీ ఉన్నత విద్యా మండలి అనుమతులు, పాలక మండలి అనుమతి మేరకు జరిగాయి.
- వీరందరినీ తీసేయాలని కూన రవికుమార్ పట్టుబడుతున్నారు.

కూన రవికుమార్ అక్కసుకు కారణమిదేనా?

ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు ఆమదాలవలస నియోజకవర్గం పొందూరు మండలం గోకర్నపల్లి వైఎస్సార్ సీపీ సర్పంచ్ సమీప బంధువు. దీంతో ఈయనను, మరికొందరిని తొలగించాలని అనేక సార్లు కూన రవికుమార్ ఒత్తిడి తెచ్చారు. అయితే పక్కాగా నిబంధనల మేరకు ఇంటర్వ్యూలు నిర్వహించి తీసుకున్న వ్యక్తిని తొలగించటం సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేశారు. దీంతో శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న తన ఇంటికి ఈ నెల 8వ తేదీన వర్సిటీ అధికారులను పిలిపించుకుని, తన ఆదేశాలు పాటించాలని అధికారులకు హుకుం జారీ చేశారు. కారణం లేనిదే తీయలేమని అధికారులు చెప్పినా పట్టించుకోలేదు. ఒక వినతి పత్రం ఇచ్చి ఉద్యోగులను తీసేయాలని హెచ్చరించటంతో అధికారులు చివరకు కమిటీ వేశారు.

డిఫెన్స్‌లో విచారణ కమిటీ సభ్యులు

విచారణకైతే రిజిస్ట్రార్ ఆదేశాలు జారీ చేశారు కానీ ఆ ఉత్తర్వులను తీసుకునేందుకు విచారణ కమిటీ సభ్యులు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. నిజాయితీగా రిపోర్టు ఇచ్చే అవకాశం లేకపోవటం, తాము చెప్పినట్లు నివేదిక ఇవ్వాలనే పెత్తనం చెలాయించే అవకాశం ఉండటం, ఉద్యోగులను అన్యాయంగా తొలగించే పాపం మూటకట్టుకోకూడదన్న ఉద్దేశంతో విచారణ కమిటీ సభ్యులు అంతర్మథనం చెందుతున్నట్టుగా తెలిసింది. ఈ కమిటీలో సభ్యులుగా కొనసాగలేమని రాత పూర్వకంగా ఓ ఇద్దరు సభ్యులు చెప్పినట్టుగా తెలుస్తోంది.

శ్రీకాకుళంలో జాబ్‌మేళా రేపు




శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న నెహ్రూ యువ కేంద్రం వేదికగా ఈనెల 23వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. ఐఐఎఫ్‌ఎల్ సమస్త ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థలో కస్టమర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, బ్రాంచ్ మేనేజర్, బ్రాంచ్ క్రెడిట్ మేనేజర్ తదితర పోస్టుల భర్తీ కోసం ఈ జాబ్‌మేళాను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 180 ఖాళీలు ఉన్నాయని, 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఇంటర్ నుంచి డిగ్రీ వరకు చదివిన పురుషులు/స్త్రీలు అర్హులని అన్నా రు. ఎంపికైన వారికి ఆకర్షణీయమైన జీతంతో పాటు ఇతర అలవెన్సులు ఉంటాయన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలలో పనిచేయాల్సి ఉంటుందని కె.సుధ పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10 గంటలకు నెహ్రూ యువకేంద్రం వద్దకు తమ బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కోరారు.

ఇంటర్‌తో ఐటీ పరిశ్రమలో ఉద్యోగాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ విద్యార్హతతో ఐటీ పరిశ్రమలోకి ప్రవేశించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఇంటర్‌విద్య డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ 2023-2024లో ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ నెల 24న ప్రముఖ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 24వ తేదీన జిల్లాలోని నరసన్నపేటలో ఉన్న జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాలలో ఉదయం 9గంటల నుంచి ఈ డ్రైవ్ మొదలవుతుందన్నారు. ఇంటర్‌లో 75శాతానికిపైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. విద్యార్థులు ముందుగా కంపెనీ నిర్వహించే కెరీర్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇంటర్వ్యూలో అర్హత సాధించాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి మధురైలో 3 నెలల తరగతులు, చెన్నైలో 9 నెలల ఇంటర్న్‌షిప్ ఉంటుందని పేర్కొన్నా రు. ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.10 వేలు శిక్షణ భృతి ఇస్తారని, శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు ఏడాదికి రూ.1.70 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం ఇస్తారని అన్నారు. ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో బీసీఏ, ఎంబీఏ, ఎంసీఏ వంటి ఉన్నత విద్య కోర్సులు అభ్యసించేందుకుగాను హెచ్‌సీఎల్ టెక్ సహాయం చేస్తుందని చెప్పారు.

పీజీ పరీక్ష 30కి వాయిదా



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించాల్సిన పీజీ రెండో సెమిస్టర్ పరీక్ష ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ చెప్పారు. భారత్ బంద్ నేపథ్యంలో వాయిదా వేశారు. విద్యార్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

వర్గీకరణ తీర్పు వెనక్కి తీసుకోవాలి



సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా టెక్కలిలో ర్యాలీ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

టెక్కలి: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం టెక్కలిలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశవ్యాప్త ఆందోళనలో కమిటీ కన్వీనర్ బోకర నారాయణరావు, ప్రధాన కార్యదర్శి చల్లా రామారావు నేతృత్వంలో టెక్కలిలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి పాత జాతీయ రహదారి మీదుగా ఇందిరాగాంధీ జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీతో పాటు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేయరాదని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ అందుకు విరుద్ధంగా వర్గీకరణకు పూనుకుంటున్నారని దుయ్యబట్టారు. తీర్పును వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

విద్యుత్ విజిలెన్స్ సీఐగా కృష్ణ

అరసవల్లి: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సర్కిల్ విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.కృష్ణను నియమిస్తూ విజిలెన్స్ జేఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు ఇక్కడ సీఐగా పనిచేసిన ఎం.వెంకటరమణను అనకాపల్లి ట్రాఫిక్ స్టేషన్ సీఐగా బదిలీ చేయగా, విజయనగరం జిల్లా విద్యుత్ విజిలెన్స్ విభాగంలో సీఐగా విధులను నిర్వర్తిస్తున్న కృష్ణను ఇక్కడ విజిలెన్స్ సీఐగా నియమించారు.

మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించనున్నట్లు సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నారాయణరావు అన్నారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో బుధవారం ఎచ్చెర్ల, లావేరు, కోటబొమ్మాళి, సారవకోట మండలాలకు చెందిన సెర్ప్ సీసీ, సీఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా చిన్న చిన్న పారిశ్రామిక యూనిట్ల నిర్వహణపై ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించాలని సూచించారు. ఆసక్తి ఉన్న పారిశ్రామిక రంగంలో శిక్షణ ఇచ్చి, అనంతరం వారికి రుణాలు మంజూరు చేసి పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు చేయించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సెర్ప్ రీసోర్స్ పర్సన్ శేఖర్, డీపీఎం శ్రీనివాస బాబా పాల్గొన్నారు.

'కొత్త క్రిమినల్ చట్టాలు రద్దు చేయాలి'



కోర్టు గేటు వద్ద నిరసన తెలుపుతున్న ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్రం తీసుకువచ్చిన మూడు కొత్త చట్టాలను రద్దు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ప్రతినిధులు నిరసన తెలిపారు. కోర్టు గేటు వద్ద బుధవారం ఈ యూనియన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. ముందుగా ర్యాలీ చేశారు. తరువాత కోర్టు గేటు వద్ద నిరసన తెలిపారు. కొత్త క్రిమినల్ చట్టాలు భారతీయ న్యాయసంహిత 2023, భారతీయ నాగరిక సురక్ష సంహిత 2023, భారతీయ సాక్ష్య అధినియం 2023లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

టెండర్లు రద్దు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఎస్ఎం పురం క్యాంపస్)లో ఫుడ్ కోర్టు (క్యాంటీన్), స్టేషనరీ, పండ్లు, పండ్ల రసం అమ్మకం దుకాణాల నిర్వహణకు ఇదివరకు టెండర్లు ఆహ్వానించారు. ఈ నెల 12వ తేదీ చివరి తేదీ కాగా, మొత్తం 17 మంది టెండర్లు వేశారు. పండ్ల దుకాణం నిర్వహణకు మాత్రమే అర్హుల నుంచి టెండర్లు వచ్చాయి. అయితే టెండర్‌లో కోట్ చేసిన ధరకు తాను అమ్మకం చేయలేని చెప్పడంతో అధికారులు ఈ టెండర్‌ను పక్కన పెట్టారు. ఫుడ్ కోర్టు, స్టేషనరీకి కనీసం అర్హత గల మూడు టెండర్లు రాలేదు. దీంతో ఈ టెండర్లు రద్దు చేశారు. అధికార పార్టీ పేరు చెప్పి కొందరు అధికారులపై ఒత్తిడి తెచ్చినా వారు పట్టించుకోలేదు. అర్హులు లేనందున నిబంధనల మేరకు టెండర్లు రద్దు చేసినట్లు అకడమిక్ డీన్ కె.మోహన్‌కృష్ణ చౌదరి చెప్పారు. భవిష్యత్తులో ఈ–టెండర్లకు వెళ్లనున్నట్లు తెలిపారు.


సుశాంత్‌కు అభినందనలు



సుశాంత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో ఇంజినీరింగ్ మొదటి ఏడాది చదువుతున్న నంబళ్ల సుశాంత్ ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. విద్యార్థిని బుధవారం కాలేజీలో సత్కరించారు. జాతీయ స్థాయికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తి నాయుడు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సభ్యులు బెండి రఘుకార్తీక్, బుడుమూరు శ్రీరామూర్తి పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో రాణించిన పోలీసుల పిల్లలు



స్విమ్మింగ్‌లో గెలుపొందిన చిన్నారులతో ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పోలీస్ సిబ్బంది పిల్లలు రాణించడంతో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అభినందించారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఛాంపియన్‌షిప్–2024 పోటీల్లో చౌదరి సంతోష్, కె.అభిరాం, కె.చిత్ర, ఎం.నికేష్, ఎం.పురంధరేశ్వరి విజేతలుగా నిలిచారు. నాలుగు విభాగాల్లో సంతోష్ బంగారు పతకాలు సాధించగా, మిగిలినవారు బంగారు, వెండి, కాంస్యం పతకాలు సాధించారు. వీరిని ఎస్పీ అభినందించారు.

సీక్రెట్‌గా సర్వీస్ లిస్టు

- 38 కాంట్రాక్ట్ ఉద్యోగుల కౌన్సెలింగ్‌లో వైద్యారోగ్య శాఖాధికారుల నిర్వాకం
- తనకు తెలియకుండా సర్వీస్ సీనియార్టీ జాబితా తయారు చేశారంటూ ఏఓ బాబూరావు అసంతృప్తి
- కౌన్సెలింగ్‌కు హాజరుకాకుండా వెనుదిరిగిన ఏఓ



స్టాఫ్ నర్సులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి, పక్కనే సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల కౌన్సెలింగ్ వివాదాస్పదంగా మారుతోంది. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బి.మీనాక్షి సమక్షంలో బుధవారం జరిగిన కాంట్రాక్ట్ ఉద్యోగుల కౌన్సెలింగ్ ప్రక్రియ అనుమానాలకు తావిస్తోంది. ఈ ఏడాది జూన్‌లో కేంద్ర ఆరోగ్య శాఖ పరిధిలోని సీమాంక్, ఎన్‌బీఎస్‌యూ, ఎంసీహెచ్ తదితర ప్రాజెక్టు కార్యాలయాలను పూర్తిగా మూసివేశారు. దీంతో అక్కడ పనిచేస్తున్న మొత్తం 38 మంది కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, వైద్యుల పోస్టులు రద్దయ్యాయి. ఆయా ప్రాజెక్టు కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జిల్లాలో ఖాళీగా ఉన్న పలు స్థానాల్లో నియమించేలా ప్రభుత్వమే ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆగమేఘాల మీద గాల్లో ఉన్న ఈ ఉద్యోగులకు కౌన్సెలింగ్ ద్వారా నియమించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే ఈ ఉద్యోగుల సర్వీస్, పుట్టిన తేదీ, విధుల్లో చేరిన తేదీల ఆధారంగా ఖాళీ స్థానాల్లో నియామకాలను చేపట్టాల్సి ఉంది. ఇక్కడే బేరసారాలు జరిగాయని, అందుకే సర్వీస్ సీనియారిటీ జాబితా అంతా సీక్రెట్‌గా జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో బుధవారం జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియలో బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనికితోడు జిల్లాలో మొత్తం 24 స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీలుండగా.. 28 మంది స్టాఫ్ నర్సులు కౌన్సెలింగ్‌లో హాజరయ్యారు. మిగిలిన నలుగురు మాత్రం గాల్లో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

ఏఓ అసంతృప్తి



తన గదిలో కూర్చున్న ఏఓ బాబూరావు

కాంట్రాక్ట్ ఉద్యోగులకు స్థానాల కేటాయింపు, ఖాళీల భర్తీ కౌన్సెలింగ్ ప్రక్రియలో సీనియారిటీ సర్వీస్ జాబితా తనకు తెలియకుండా రహస్యంగా చేశారని, అలాంటప్పుడు ఈ కౌన్సెలింగ్‌లో తానెలా కూర్చుంటానని డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఏఓ బాబూరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన కౌన్సెలింగ్ గది నుంచి వెళ్లిపోవడం సంచలనమైంది. డీఎంహెచ్‌ఓ మీనాక్షి సమక్షంలో బుధవారం ఉదయం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్ మాత్రమే హాజరు కాగా ఏఓ బాబూరావు మాత్రం తానుండేది లేదంటూ కోపంగా వెనుదిరిగారు. కీలక ఉద్యోగులు అనుకూలంగా ఉన్న వారి పేర్లను సీనియార్టీ జాబితాలో చేర్చి అక్రమ వసూళ్లు చేపట్టారనే అంశం చర్చకు దారితీసింది. సీనియార్టీ జాబితాలో ఉన్న ఉద్యోగులు దాదాపుగా శ్రీకాకుళం అర్బన్ హెల్త్ సెంటర్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 12 స్టాఫ్ నర్సు పోస్టులుండగా, ముందుగా అనుకూలంగా ఉన్నవారంతా వీటిని ఎంపిక చేసుకుంటే మిగిలిన వారు కొత్తూరు, పొందూరు, టెక్కలి, ఆమదాలవలస, పలాస, బుడితి తదితర కమ్యూనిటీ ఆస్పత్రుల్లో స్థానాలను ఎంపిక చేసుకోవాల్సి వచ్చింది. దీంతోపాటు పోస్టులు ఖాళీలు లేకపోవడంతో ఓ నలుగురు స్టాఫ్ నర్సులకు ఏ స్థానం దక్కకపోవడంతో వారిలో మరింత ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల బదిలీలు, స్థానాల కేటాయింపులపై టీడీపీ నేతల హడావుడి ఎక్కువవుతున్న తరుణంలో ఇక్కడి కీలక ఉద్యోగుల తీరు కూడా ఇంకా దారుణంగా తయారైంది. ప్రతి పనికి జేబులు నింపాల్సిందేననే టాక్ వినిపిస్తోంది.

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

- టీడీపీ వేధింపులే కారణమంటున్న కుటుంబ సభ్యులు



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సోమేశ్వరరావు

కోటబొమ్మాళి: శ్రీజగన్నాథపురంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గుంట సోమేశ్వరరావు మంగళవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుల వేధింపుల కారణంగానే సోమేశ్వరరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సోమేశ్వరరావు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పాడుగుపాడు గ్రామంలో విశాఖ డైరీ పాల సేకరణ కేంద్రాన్ని కొన్నేళ్లుగా నడుపుతున్నాడు. వైఎస్సార్ సీపీ మద్దతుదారుడిగా ఉండడంతో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక శ్రీజగన్నాథపురం పంచాయతీ టీడీపీ నాయకులు సోమేశ్వరరావును ఉద్యోగంతో పాటు విశాఖ డైరీ పాల కేంద్రాన్ని తొలగించేందుకు కూడా పన్నాగం మొదలుపెట్టారు. సోమవారం గ్రామంలో సోషల్ ఆడిట్ నిర్వహించగా.. ఇదే అదనుగా టీడీపీ నాయకులు రెచ్చిపోయి సోమేశ్వరరావుపై అభియోగాలు మోపారు. పనికి వెళ్లకుండానే మస్టర్లు వేసి డబ్బులు దండుకున్నారంటూ సోమేశ్వరరావుపై ఆరోపణలు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు తొలగించాలని డ్వామా అధికారులకు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. విశాఖ డైరీ అధికారులపై కూడా ఒత్తిడి చేశారు. మంగళవారం రాత్రి పాల సేకరణ కేంద్రాన్ని తొలగిస్తున్నట్లు విశాఖ డైరీ అధికారులు సోమేశ్వరరావుకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో సోమేశ్వరరావు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని కుటుంబ సభ్యులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు.

అక్రమ ఎరువుల నిల్వలు సీజ్

కంచిలి: డోలగోవిందపురం గ్రామంలో అక్రమ ఎరువుల నిల్వలు ఉన్నాయనే సమాచారం మేరకు మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన లడ్డుకేశవ పాత్రో ఇంటిలో బుధవారం సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 50 బస్తాల 20–20–0–13, 12 బస్తాల డీఏపీ లభించాయి. ఎరువులు కొన్న బిల్లులు వివిధ తేదీల్లో ఉండటంతో ఎరువులను సీజ్ చేసి, నోటీసు ఇవ్వడం జరిగిందని వ్యవసాయాధికారి తెలిపారు. ఎరువులకు సంబంధించిన బిల్లులను పూర్తిగా విచారించిన తర్వాత ఎరువులను వాడుకోవడం కోసం రిలీజ్ చేస్తామని తెలిపారు. రైతు లడ్డుకేశవపాత్రో మాట్లాడుతూ.. తనకు 96 ఎకరాల పొలం ఉందని, మొత్తంగా 200 బస్తాలు అవసరం అవుతాయని, ఈ ఎరువులకు కూడా పూర్తిగా బిల్లులు ఉన్నాయని తెలిపారు.

ఎఫ్‌పీఓల బలోపేతానికి చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ)ల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జరిగిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు మెరుగైన, నాణ్యమైన పంటలను ఉత్పత్తి చేయడానికి ప్రోత్సహించాలని, వ్యవసాయ ఉత్పత్తి ఖర్చును తగ్గించడం ద్వారా రైతులు ఆదాయం పొందేందుకు వీలుంటుందని చెప్పారు. ఇందుకోసం మెరుగైన సాంకేతికత, మార్కెటింగ్ సౌకర్యం తదితర వాటి కోసం సన్న చిన్న కారు రైతులు ఎఫ్‌పీఓలో చేరి భాగస్వామ్యం కావడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్), వివిధ సంస్థల ఆధ్వర్యంలో 32 ఎఫ్‌పీఓలు పనిచేస్తున్నట్లు వివరించారు. కొత్తవి ఏర్పాటు చేసుకునేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని, రైతు బజార్లలో రిటైల్ దుకాణాలు ఇవ్వాలని, లైసెన్సుల జారీ సులభతరం చేయాలని ఆయా ఎఫ్‌పీఓలు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు పెండింగ్ లేకుండా అన్ని రకాల లైసెన్సులు మంజూరు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.శ్రీధర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

మనసుతో చికిత్స



- రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆటిజం చిన్నారులకు చికిత్స
- 100 రకాల ఆట వస్తువులతో శిక్షణ
- ఐదు రకాల థెరపీలతో ట్రీట్‌మెంట్



ఆటిజం ట్రీట్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన కొన్ని వస్తువులు

శ్రీకాకుళం కల్చరల్: ఆటిజం.. చిన్నారులకు ఎదురవుతున్న సమస్యల్లో ప్రధానమైనది. మానసిక ఎదుగుదలలో లోపం ఉండడాన్నే వైద్య పరిభాషలో ఆటిజం అని పిలుస్తారు. మన వద్ద చాలా మంది చిన్నారులు ఈ సమస్యతో బాధ పడుతున్నా.. సరైన అవగాహన లేక తల్లిదండ్రులు చికిత్స ఇప్పించలేకపోతున్నారు. సాధారణంగా ఐదేళ్ల లోపు చిన్నారుల్లో వచ్చే న్యూరోలాజికల్ డిజార్డర్‌ను గుర్తించి వారికి సరైన పద్ధతిలో ట్రీట్‌మెంట్ చేస్తే చాలా వరకు మిగిలిన పిల్లలతో కలిసిపోతారు. జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఆటిజంకు చికిత్స అందిస్తున్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో జిల్లా కేంద్రంలోనే దాదాపు వంద మంది చిన్నారులు ఈ సమస్యతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. ఇలాంటి చిన్నారులకు అతి తక్కువ ఖర్చుతో ట్రీట్‌మెంట్ అందించేందుకు మగటపల్లి రమణమూర్తి చారిటబుల్ ట్రస్టు, దుర్గా ధీరజ్ చారిటబుల్ ట్రస్టుల సహకారంతో శాంతాకల్యాణ్ అనురాగ నిలయం వద్ద రిటైర్డ్ స్టేటు బ్యాంకు ఉద్యోగుల నిర్మించిన భవనంలో ఆటిజం కేంద్రాన్ని ప్రారంభించారు.

లక్షణాలివే..

- ఆటిజం సమస్య గల పిల్లల మెదడులో కొంత భాగం సరిగా పనిచేయదు.
- ఇది ప్రాణాంతకం కాదు. కానీ ఎదుగుదలలో సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.
- దీని లక్షణాలు పిల్లలకు 2–3 ఏళ్ల మధ్య వయసులో కనిపిస్తాయి.
- మూర్ఛ, నిరాశ, ఆందోళన, హైపర్ యాక్టివిటీ డిజార్డర్, అందరితో కలవకుండా, మాట్లాడకుండా ఉండడం, వినికిడి లేకపోవడం, కోపంగా ఉండడం, ఊరికినే అరవడం, శబ్దాలను పట్టించుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.



చికిత్స కేంద్రంలోని ఆట వస్తువులు

- ఈ లక్షణాలను తల్లిదండ్రులు గుర్తించి సరైన చికిత్స అందించాల్సి ఉంటుంది.
- ఈ సమస్య మగ పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది.

ఐదు రకాల థెరపీలతో..

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటిజం కేంద్రంలో 5రకాల థెరపీలు అందిస్తున్నారు. మొదటగా అక్యుపేషనల్ థెరపీలో భాగంగా రోజుకు 45 నిమిషాలలో రోజువారీ చేసే కార్యక్రమాలైన బ్రషింగ్, బాతింగ్, డ్రస్ వేసుకోవడం వంటి వాటితో పాటు బాడీ మసాజ్, ఫిజియోథెరపీ ఇస్తారు. 5 నిమిషాలు కౌన్సిలింగ్ ఇస్తారు. రెండోది బిహేవియర్ థెరపీ. వారు ఒక దగ్గర కుదురుగా కూర్చోవడం, మాట్లాడడం, చూడడం వంటి వాటిపై థెరపీ అందిస్తారు. మూడోది స్పీచ్ థెరపీ. తెలుగు, ఇంగ్లిష్ మాట్లాడే విధానంలో ఏ,ఇ,ఐ,ఓ,యులు, అచ్చులు, హల్లులు, పదాలు నేర్పుతారు. నాల్గోది స్పెషల్ ఎడ్యుకేషన్ థెరపీ. స్కూలుకు వెళ్లేందుకు తయారవడం, రాయించడం, ఏబీసీడీలు,నంబర్‌లు, పదాలు రాయడం నేర్పుతారు. ఐదోది పేరెంటల్ కౌన్సిలింగ్. తల్లిదండ్రులకు గ్రూప్ థెరపీ ఉంటుంది. పిల్లలకు అనుగుణంగా వారు నడుచుకోవడానికి తెలియచేయడం జరుగుతుంది. చిన్నారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సమయంలో తల్లిదండ్రులు చూసే విధంగా సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు.


వందకుపైగా ఆట వస్తువులతో..

చిన్నారులకు థెరపీ సమయంలో వారి అభిలాషకు తగ్గట్టుగా వందకు పైగా ఉన్న ఆటవస్తువులతో ఆడిస్తూ, వారి ప్రవర్తించే విధానాన్ని గమనించి దాని ద్వారా వారికి కావాల్సింది అందిస్తూ చికిత్స చేస్తారు. ఒకేసారిగా 8మందికి థెరపీ ఇచ్చేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఒక్కో గదిలో కేవలం ఒకే చిన్నారికి థెరపీని అందజేస్తున్నారు. అతి తక్కువ ఖర్చుతో చికిత్స అందిస్తున్నారు. రెండు కేంద్రాలు ఉండగా.. ఏడు సిట్టింగ్‌లకు రూ. 12వేలు వసూలు చేస్తున్నారు. పేద, మధ్య తరగతి వారికి చికిత్స ధరలు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు.

వారంలో ఆరు రోజులు..

ఈ కేంద్రం వారంలో ఆరు రోజులు పనిచేస్తుంది. ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 5 వరకు పనిచేస్తుంది. కేంద్రంలో చేర్చాలనుకునే వారు 9059809568 నంబరుకు కాల్ చేయాలి.

అందరికీ అందుబాటులో సేవలు



ఇలాంటి ఆటిజం కేంద్రాలు జిల్లాలో ఎక్కడా లేవు. నగరంలో కొన్ని ఉన్నా పేద, మధ్య తరగతి వారికి అందుబాటులో లేవు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ కేంద్రం రెండు చారిటబుల్ ట్రస్టుల సహకారంతో ఏర్పాటు చేశాం. అందరూ వినియోగించుకోవాలి.

– పి.జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ ఛైర్మన్

చిన్నారుల కోసం



ఎంతో మంది ఆటిజం సమస్యతో బాధపడడం నేను చూశాను. అందుకే రెడ్‌క్రాస్ ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రానికి నా వంతు సహకారాన్ని మా ట్రస్టు ద్వారా అందజేస్తున్నాం.

– దుర్గా శ్రీనివాస్, దుర్గా ధీరజ్ చారిటబుల్ ట్రస్టు

అభివృద్ధికి గిరిజన గ్రామాల గుర్తింపు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పర్టిక్యులర్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూపులు(పీవీటీజీ) అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కేంద్ర గిరిజన సంక్షేమ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఆర్.సుబ్రహ్మణ్యం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి గృహ నిర్మాణాలు, మహిళా శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యం, గిరిజన సంక్షేమం, పంచాయతీ రాజ్, తదితర శాఖలపై ఆయన జిల్లా కలెక్టర్లతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మందస మండలం చీపి, కొత్తూరు మండలం అడ్డంగి, నందిగాం మండలం పెదగురువూరు గ్రామాలను మోడల్ గ్రామలుగా అభివృద్ధి చేయడానికి గుర్తించినట్లు వివరించారు. జిల్లాలో 534 పీవీటీజీ హేబిటేషన్లు ఉన్నాయని చెబుతూ ఆ గ్రామాల్లో సదుపాయాల గురించి వివరించారు. మొత్తం 1650 గృహాలు మంజూరైనట్లు చెప్పారు. గృహ నిర్మాణాలకు స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కొన్ని చోట్ల భూ సమస్య ఉందని, తహసీల్దార్లతో చెప్పి క్లియర్ చేస్తామన్నారు. మొబైల్ నెట్‌వర్క్ పై బీఎస్ఎన్ఎల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతి శ్రీ, సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం.శ్రీనివాసరావు, గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి పీడీ నగేష్, పంచాయతీ రాజ్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



తీవ్రగాయాలపాలైన మహేష్

టెక్కలి రూరల్: మండలంలోని గూడేం పంచాయతీ పరిధి సన్యాసి నీలాపురం గ్రామ సమీప రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మెళియాపుట్టికి చెందిన జన్ని విరేష్ అనే వ్యక్తి టెక్కలి నుంచి తన గ్రామానికి బయల్దేరాడు. నర్సింగపల్లి గ్రామానికి చెందిన కడియాల మహేష్ తన ద్విచక్రవాహనంపై టెక్కలి వైపు వస్తుండగా ఈ రెండు ద్విచక్రవాహనాలు సన్యాసి నీలాపురం గ్రామ మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టాయి. ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఒకడైన మహేష్‌కు పది రోజుల కిందటే పెళ్లయ్యింది. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందివ్వడంతో పోలీసులు వివరాలు సేకరించారు.

గుండెపోటుతో యువకుడు మృతి



గుండె పోటుతో మృతి చెందిన తంగుడు సుధీర్

టెక్కలి: టెక్కలికి చెందిన 31 ఏళ్ల తంగుడు సుధీర్ బుధవారం గుండె పోటుతో మృతిచెందాడు. యువకునికి హఠాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలో గల ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు సుధీర్‌కు భార్య మానస, ఆరేళ్ల వయసు కలిగిన కుమార్తె అన్విత రాణి ఉన్నారు. కొన్నేళ్ల కిందట సుధీర్ తండ్రి నాగేశ్వరరావు కూడా గుండెపోటుతోనే మృతి చెందారు.

కూర్చున్న చోటనే..



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రామారావు

వజ్రపుకొత్తూరు రూరల్: పాతపట్నం మండలం రొంపివలస గ్రామానికి చెందిన పోతల శాంతమ్మ (55) నువ్వలరేవులో బుధవారం ఉదయం మృతి చెందారు. స్థానిక ఎస్ఐ సీహెచ్ రామారావు, స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. మృతురాలు గత 40 ఏళ్లగా తన భర్త గోపితో కలిసి బెండి గేట్ కూడలి వద్ద నివాసం ఉంటూ కరివేపాకు విక్రయిస్తూ యాచకం చేస్తుంటారు. ఎప్పటిలాగానే బుధవారం ఉదయం నువ్వలరేవు బయల్దేరి వెళ్లి కరివేపాకు విక్రయించి తర్వాత యాచిస్తూ గ్రామంలో ఉన్న మందిరం వద్ద అపస్మారక స్థితికి చేరుకుంది. కూర్చున్న చోట పడిపోయిన ఆమె చాలాసేపటి వరకు లేవలేదు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకొని మృతురాలి భర్తకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం



చెరువులో లభ్యమైన యువకుడి మృతదేహం

పోలాకి: మండలంలోని వెదుళ్లవలస కరణాలచెరువులో పడి గల్లంతైన యువకుడు అమలాపురం దుర్గారావు మృతదేహం అదే చెరువులో బుధవారం లభ్యమైంది. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి గల్లంతైన యువకుడిని వెతుకులాడే సమయంలోనే మృతదేహం తేలియాడడంతో గమనించి ఒడ్డుకు చేర్చారు. మృతుడి సోదరుడి వివాహం మరో వారం రోజుల్లో ఉండగా ఈఘటన జరగటంతో స్థానికంగా విచారం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కుమ్మరిగుంట యువకుడు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట గ్రామానికి చెందిన వలస కార్మికుడు సాధు సంతోష్ కుమార్ (23) బుధవారం విజయవాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం సాధు ఈశ్వరమ్మ, ఆదినారాయణల కుమారుడు గత నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో సినీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. మంగళవారం అమలాపురంలో జరిగిన పెళ్లి వేడుకకు స్నేహితుడితో కలసి హాజరై తిరిగి బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా విజయవాడ సమీపంలో ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీ కొనడంతో మృతి చెందాడు. దీంతో కుమ్మరిగుంటలో విషాద ఛాయలు అలముకున్నాయి. చేతికి అందివచ్చిన ఒకే కుమారుడు అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

పాముకాటుకు మహిళ మృతి

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని గుర్రాలపాలేం గ్రామానికి చెందిన బాద వరలక్ష్మి (53) అనే మహిళ బుధవారం ఉదయం 9 గంటల సమయంలో పాము కాటుకు గురైంది. ఈమెను చికిత్స నిమిత్తం 108లో రిమ్స్ ఆస్పత్రికి తరలించగా 11.45 నిమిషాలకు చనిపోయారు. ఈమె భర్త రమణ ఫిర్యాదుమేరకు లావేరు పీసీ హెడ్ కానిస్టేబుల్ ఎం.విజయానంద్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.